క్లుప్తంగా

ఆకట్టుకున్న దీపాలంకరణ



నీటి తొట్టెలో కనకదుర్గ అమ్మవారికి పూలు, దీపాలతో చేసిన అలంకరణ

సామర్లకోట: పట్టణంలోని పాత్రుళ్ల వీధిలో ఉన్న కనకదుర్గ ఆలయంలో ఏర్పాటు చేసిన దీపాలంకరణ భక్తులను ఆకట్టుకుంది. నీటి తొట్టెలో అమ్మవారి విగ్రహాన్ని ఉంచి.. ఆ నీటిలో దీపాలను వెలిగించారు. కొలనులా ఏర్పాటు చేసి, అందులో కలువ పువ్వులు ఉంచారు. ఇటీవల ఆలయంలో సుమారు 300 మంది మహిళలు చీర, సారె కార్యక్రమం నిర్వహించారు. అలాగే ఆలయ కమిటీ నాయకులు నీటి తొట్టె ఏర్పాటు చేసి, అందులో పువ్వులతో దీపాలను వెలిగించే కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ రాష్ట్ర అయ్యరక సంఘ అధ్యక్షుడు ఆవాల లక్ష్మీనారాయణ ప్రారంభించగా, మహిళలు దీపాలను వెలిగించారు. ఆలయ కమిటీ నాయకులు పెదిరెడ్ల కృష్ణ, బొడుగు ప్రసాద్, కర్రి నారాయణ, కర్రి ఉమామహేశ్వరరావు, కర్రి రామకృష్ణ, ఎలిశెట్టి శివాజీ భక్తులకు సేవలందించారు.

మరిడమ్మ ఆలయంలో భజన



భజన నిర్వాహకుడిని సత్కరిస్తున్న ఈఓ తదితరులు

పెద్దాపురం(సామర్లకోట): శరన్నవరాత్ర ఉత్సవాలను పురస్కరించుకుని పెద్దాపురం మరిడమ్మ ఆలయంలో మంగళవారం సాయంత్రం నిర్వహించిన భజన కార్యక్రమం భక్తులను ఆకట్టుకుంది. ఉత్సవాల సందర్భంగా ప్రతి రోజూ ఆలయంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా పెద్దాపురం మండలం తిరుపతి గ్రామానికి చెందిన కోదండ రామబాల భజన సమాజం వారి భజన ఏర్పాటు చేశారు. భజన నిర్వాహకుడు మొయిళ్ల ఏసుబాబును ఈఓ కె.విజయలక్ష్మి ఆధ్వర్యంలో సత్కరించారు.

నవరలో ప్రత్యేక పూజలు



నవరలో పూజలు చేస్తున్న సర్పంచ్ దంపతులు, చిన్నారులు

సామర్లకోట: మండలంలోని నవర గ్రామంలో సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల ఉపాధ్యక్షుడు దమ్మాల లక్ష్మణరావు, నాగమణి దంపతుల ఆధ్వర్యంలో చిన్నారులతో మంగళవారం రాత్రి ప్రత్యేక పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న మహిళలకు, చిన్నారులకు ప్రసాద వితరణ చేశారు.

డిజిటల్ బుక్ నేడు ఆవిష్కరణ

సామర్లకోట: వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలకు అన్యాయం జరిగితే వారికి అండగా నిలబడేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకొచ్చిన డిజిటల్ బుక్ ఆవిష్కరణ బుధవారం ఉదయం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద జరుగుతుందని పార్టీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ దవులూరి దొరబాబు తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ, పార్టీ నాయకులు, కార్యకర్తలకు జరిగిన అన్యాయాన్ని ఈ బుక్‌లో స్కాన్ చేయడం ద్వారా పార్టీ అధినేతకు చేరుతాయని చెప్పారు. మున్సిపల్ చైర్‌పర్సన్లు, వైస్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో హాజరుకావాలన్నారు.



పెద్దాపురం మరిడమ్మ వారు



పెద్దాపురంలో దుర్గాంబిక అలంకారంలో భువనేశ్వరీ మాత



విశేషాలంకరణలో పిఠాపురం పురుహూతికా అమ్మవారు



దుర్గాదేవి అలంకరణలో కాండ్రకోట నూకాలమ్మ



దుర్గాదేవిగా పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీదేవి



సామర్లకోట పంచారామ క్షేత్రంలోని అమ్మవారు

అమ్మా భవానీ..

- దుర్గాదేవిగా రాజరాజేశ్వరీదేవి
- ఘనంగా దుర్గాష్టమి పూజలు

పిఠాపురం: దక్షిణ కాశీగా విరాజిల్లుతున్న పాదగయ క్షేత్రంలో దసరా ఉత్సవాల్లో భాగంగా రాజరాజేశ్వరీదేవి దుర్గాదేవిగా మంగళవారం భక్తులకు దర్శనమిచ్చారు. వేలాదిగా భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. పురుహూతికాదేవికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. పిఠాపురం నియోజకవర్గంలో కొత్తపల్లి గొల్లప్రోలు, పిఠాపురం మండలాల పరిధిలోని కనకదుర్గ అమ్మవారి ఆలయాల్లో దుర్గాష్టమి పూజలు ఘనంగా జరిగాయి. గురువారం నిర్వహించనున్న దశమి ఉత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరోవైపు వివిధ వ్యాపార సంస్థలు దసరా ప్రత్యేక పూజలకు తమ కార్యాలయాలను సిద్ధం చేశారు. పిఠాపురంలో మహాలక్ష్మీదేవి ఆలయంలో అమ్మవారు రాజరాజేశ్వరీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గొల్లప్రోలులో విజయదుర్గ అమ్మవారి ఆలయంలో చండీ హోమం నిర్వహించారు. కొత్తపల్లి దుర్గాదేవి అమ్మవారు దుర్గాదేవిగా దర్శనమిచ్చారు.

మహిషాసురమర్ధిని రూపంలో..

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో ఉన్న స్వామివారి దేవేరి బాలాత్రిపుర సుందరీదేవి మహిషాసురమర్ధిని రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీచక్ర నవవర్ణార్చన, సహస్ర గులాబీ అర్చన, దర్బారు సేవ, బాలా పరమేశ్వరీ మంత్ర జపం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మహిషాసురమర్ధిని అమ్మవారి ఆలయం వద్ద గణపతి హోమం, రుద్ర హోమం, సహస్ర చండీ హోమం జరిగాయి.



సామర్లకోట పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి

అమ్మవారిని బంగారు కిరీటం, బంగారు ఆభరణాలతో, కుమారారామ భీమేశ్వరస్వామిని వెండి ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వరశర్మ, అల్లకి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఈఓ నీలకంఠం ఆధ్వర్యంలో అన్నప్రసాద వితరణ చేశారు. అయోధ్య రామపురంలోని కనకదుర్గ ఆలయం, సత్తెమ్మ తల్లి ఆలయం, బడేలమ్మ చెరువు వద్ద నవదుర్గ ఆలయంతో పాటు, వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి మండపాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

సామూహిక అష్టలక్ష్మి పూజలు

సామర్లకోట మండలం పీబీ దేవం గ్రామంలోని శారదా రామకృష్ణ సేవా సమితిలో భక్తిశ్రద్ధలతో అష్టలక్ష్మి పూజలు జరిగాయి. తెల్లవారుజాము నుంచి ఇంద్రకంటి గోపాలశర్మ ఆధ్వర్యంలో శాస్త్రోక్తంగా లలితా సహస్రనామాలు, నీరాజన మంత్రపుష్పాలతో సామూహిక అష్టలక్ష్మి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. 150 మంది మహిళలు పూజలు చేశారు. సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్, గౌరవాధ్యక్షుడు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు టీవీవీ సత్యనారాయణ, నువ్వుల వెంకటరాజు, బాబ్జీ, సూర్యచంద్రరావు, టి.సాంబశివరావు, తోట వెంకటరమణ, కమ్మిలి వెంకటేశ్వరరావు, తెలుగుంట నరసింహారావు, టి.సూర్యప్రకాశరావు భక్తులకు సేవలందించారు.



కొమరగిరిలో మహాలక్ష్మీదేవి అలంకరణలో..

దుర్గాంబగా భువనేశ్వరీ అమ్మవారు

పెద్దాపురం(సామర్లకోట): పట్టణంలోని వర్జులవారి వీధిలో ఉన్న భువనేశ్వరీ పీఠంలో అమ్మవారు దుర్గమ్మ అలంకారంలో దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపిశర్మ సిద్ధాంతి, శాస్త్రి ఆధ్వర్యంలో మండపారాధన, అభిషేకాలు, సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణ, శ్రీచక్రార్చన, చండీహోమం, మంత్ర పుష్పం, దర్బారు సేవ నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళలు ప్రత్యేక పూజలు, వేద పండితులు హోమాలు నిర్వహించారు. పెద్దాపురం మరిడమ్మ వారు, కాండ్రకోట నూకాలమ్మ వారు దుర్గాదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. ఆలయ ఈవోలు విజయలక్ష్మి, రాంబాబురెడ్డి ఆధ్వర్యంలో కుంకుమ పూజలు జరిగాయి. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.



పెద్దాపురంలో కలశాలతో ఊరేగింపులో పాల్గొన్న మహిళలు

కనకదుర్గమ్మకు కుంభాభిషేకం

పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని కుమ్మర వీధిలో ఉన్న కనకదుర్గ అమ్మవారికి కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయంలో నిర్వహిస్తున్న శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం మహిళలు జలాలున్న కలశాలతో పెద్దాపురం పట్టణ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. గరగలు, బ్యాండు మేళంతో నృత్యాలు చేశారు. మహిళలు తీసుకొచ్చిన జలాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించారు.

మార్మోగిన భవానీ నామం

కొత్తపల్లి: మండలంలోని అమ్మవారి ఆలయాల్లో దేవీ నవరాత్రుల ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. స్థానిక శ్రీధర్మశాస్తా ఆలయంలో ఉన్న కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. గాదులదొడ్డిలోని బాలకనకదుర్గా ఆలయంలో పూజలు నిర్వహించారు. కొండెవరంలోని కనకదుర్గా ఆలయంలో భవానీ భక్తులు కుంకుమ పూజలు చేశారు. కొమరగిరిలో బాలకనకదుర్గాదేవి మహాశ్రీలక్ష్మిగా దర్శనమిచ్చారు. వివిధ కనకదుర్గ ఆలయాల్లో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని వాకతిప్ప బాలకనకదుర్గా దేవి ఆలయం వద్ద దసరా ఉత్సవాల్లో భాగంగా కనకదుర్గా వేషధారణ అలరించింది.



పీబీ దేవంలో సామూహిక అష్టలక్ష్మి పూజలు



కొత్తపల్లి గాదులదొడ్డిలో చేసిన దీపాలంకరణ

కమనీయం.. దసరా సంబరం

- రేపు ఏనుగుల పండగ
- అలరించనున్న సాంస్కృతిక కార్యక్రమాలు
- ఆరు దశాబ్దాలుగా నిర్వహణ

కరప: మిరుమిట్లు గొలిపే విద్యుద్దీపాలంకరణ.. సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దిన ఏనుగు, హంస వాహనాలు.. బ్యాండు మేళాలు.. అలరించే సాంస్కృతిక కార్యక్రమాలు.. కోయడ్యాన్సులు, తప్పెటగుళ్లు, వెలుగుబంటి వేషాలు, కోలాటం, బుట్టబొమ్మలు, లక్క గుర్రాలతో చేసే విన్యాసాలు.. వీటితో కరపలో జరిగే విజయ దశమి సంబరాలు కనువిందు చేస్తాయి. లక్షలాది రూపాయల వ్యయంతో కన్నుల పండువగా సాగే ఇక్కడి దశమి సంబరం ప్రసిద్ధిగాంచింది. వేడుకలను తిలకించేందుకు వివిధ ప్రాంతాల నుంచి వేలాదిగా ప్రజలు తరలివస్తుంటారు. గురువారం జరగనున్న కరప దసరా ఉత్సవంపై ప్రత్యేక కథనం.

అంకురార్పణ

సుమారు ఆరు దశాబ్దాల క్రితం కరపకు చెందిన దొరలు ఇప్పటి కోల్‌కతాలోని కాళికామాత ఉత్సవాల్లో నిజమైన ఏనుగులను అలంకరించి ఊరేగించేవారు. దీనిని చూసి ఏనుగుబొమ్మతో ఇక్కడి సంబరానికి అంకురార్పణ జరిగిందని పెద్దలు చెబుతుంటారు. తొలుత గ్రామంలోని పల్లపువీధిలో వెదురు బద్దలు, అట్టముక్కలు తదితర వాటితో చిన్నపాటి ఏనుగు బొమ్మను తయారుచేసి ఉత్సవాన్ని నిర్వహించేవారు. తదనంతరం కాలంలో గ్రామంలోని మెరక వీధి, కొత్తపేట, బీసీపేట, సీతమ్మవీధి, వీధుల వారు భారీ పరిమాణంలో ఏనుగు, హంస బొమ్మలను తయారు చేసి సంబరం చేయనారంభించారు. ఇటీవల కాలంలో నీలయ్యతోట, ఎస్సీ కాలనీ, రామకంచిరాజు నగర్ కాలనీవాసులు ఆయా బొమ్మలను తయారుచేసి సంబరం చేస్తుండటంతో పండగ శోభ మరింత పెరిగింది. మొదట్లో ఏనుగు, హంస బొమ్మలను రంగు కాగితపు పూలు, కొవ్వొత్తులతో అలంకరించి, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో గ్రామమంతా ఊరేగిస్తూ సంబరాన్ని నిర్వహించేవారు. అప్పట్లో గ్రామంలోని మార్కెట్ సెంటర్‌లో దసరా రోజు సాయంత్రం ఏర్పాటు చేసే జ్వాలా తోరణం ప్రసిద్ధి చెందిందని పెద్దలు చెబుతుంటారు. తర్వాత రోజుల్లో జ్వాలాతోరణ ప్రదర్శనలో చిన్న అపశ్రుతి చోటుచేసుకోవడంతో ఆ కార్యక్రమాన్ని విరమించారని గ్రామస్తులు అంటున్నారు.

సరికొత్త శోభ

మారుతున్న కాలానుగుణంగా ఏనుగుల సంబరంగా పిలిచే దసరా సంబరం కొత్త శోభను సంతరించుకుంది. కొవ్వొత్తుల స్థానే రంగురంగుల విద్యుద్దీపాలతో బొమ్మల అలంకరణ ప్రారంభమైంది. ఏనుగు బొమ్మలకు తెలుపు రంగు విద్యుత్ బొమ్మలను వినియోగిస్తే, హంస బొమ్మలకు మాత్రం ఆయా వీధుల వారు మిరుమిట్లు గొలిపే రీతిలో విద్యుద్దీకరణ చేయనారంభించారు. ఒక్కొక్క ఏనుగు, హంస వాహనాలకు ఎదురుగా బ్యాండ్‌మేళాలు, లక్క గుర్రాలు, తప్పెటగుళ్లు, కోలాటం, కోయడ్యాన్సులు, వెలుగబంట్ల నృత్యాలు, కరాటే, బండ్లపై వేషాలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలతో తెల్లవార్లూ గ్రామంలో ఊరేగుతుంటారు. కరపలో జరిగే ఏనుగుల సంబరం (దసరా ఉత్సవాన్ని) తిలకించేందుకు కరప, పరిసర మండలాల నుంచే కాకుండా, దూర ప్రాంతాల నుంచీ తరలివస్తారు. దసరా రోజున గ్రామస్తులతో పాటు, పరిసర గ్రామాల నుంచి చిరు వ్యాపారులు, రోడ్డు పక్కన వివిధ వస్తువులను విక్రయిస్తారు. లక్షలాది రూపాయల మేర వ్యాపారం జరుగుతుంది.

గ్రామం సుభిక్షంగా ఉండాలని..

ఏనుగు, హంస వాహనాలు గ్రామంలోని వీధుల్లో ఊరేగిన అనంతరం తెల్లవారుజాము సమయంలో సంబరం మొత్తం గ్రామ ప్రధాన రహదారిపైకి చేరుతుంది. గ్రామంలో పాడిపంటలు వృద్ధిచెంది, ప్రజలు సుఖశాంతులతో జీవించాలని కోరుతూ ప్రధాన రహదారిపై ఏనుగు, హంస వాహనాలను ఎదురెదురుగా ఉంచి జమ్మిపత్రితో శమీపూజ చేస్తారు. అక్కడి నుంచి ఒకదాని వెంబడి మరో వాహనం, బ్యాండుమేళాలతో, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో ముందుకు సాగుతుంటే, చూసే వారికి కనువిందుగా ఉంటుంది. రైతులు పండించే ధాన్యం విక్రయాలపై వచ్చిన కొలగారం, గ్రామస్తులు, భక్తులు ఇచ్చే చందాలతో ఆయా వీధుల వారు సంబరాన్ని ఘనంగా నిర్వహిస్తారు.

దుర్గాదేవికి గ్రామోత్సవం

గ్రామంలోని హైస్కూల్ సెంటర్‌లోని దుర్గాదేవి ఆలయంలో శరన్నవరాత్ర మహోత్సవాలు ప్రారంభమైన రోజు నుంచి ప్రతిరోజు అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి, కుంకుమార్చనలు చేస్తారు. భజన బృందాలతో భక్తి సంకీర్తనలు పరిపాటి. విజయ దశమి రోజున అమ్మవారిని పల్లకీలో ఉంచి బ్యాండుమేళం, బాణసంచా కాల్పులతో గ్రామోత్సవం జరుపుతారు.



కరపలో తెల్లవారుజామున మెయిన్ రోడ్డులో దసరా సంబరం (ఫైల్)



విద్యుద్దీపాలంకరణలతో ముస్తాబు చేసిన ఏనుగు వాహనాలు (ఫైల్)



ఊరేగింపులో లక్క గుర్రం (ఫైల్)

సేంద్రియ బాట

- ఈ ఎరువుల వినియోగంపై రైతుల ఆసక్తి
- స్వయంగా తయారు చేసుకుంటున్న అన్నదాతలు
- నియోజకవర్గంలో 2,150 ఎకరాల్లో సాగు



వాకతిప్పలో సేంద్రియ ఎరువు తయారు చేస్తున్న రైతులు

కొత్తపల్లి: వ్యవసాయంలో సేంద్రియ ఎరువుల వినియోగంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రసాయన ఎరువుల వినియోగం వల్ల కలిగే అనర్థాలను గుర్తించిన కొందరు రైతులు భూసారం పెంపుపై దృష్టి సారించారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు ఇచ్చే సేంద్రియ ఎరువులను వాడాలని వ్యవసాయ శాఖ అధికారుల సూచనల మేరకు గ్రామీణ రైతులు పశువుల పేడ, మూత్రం, చెరువుల్లోని పూడిక మట్టిని పొలాలకు తరలిస్తున్నారు. మరి కొందరు రైతులు పశువుల పేడను ఇతర రైతుల నుంచి కొనుగోలు చేసి పొలాల్లో వేస్తున్నారు. పిఠాపురం నియోజకవర్గంలో సుమారు 2,150 ఎకరాల్లో సుమారు 2,500 రైతులు సేంద్రియ సాగు చేస్తున్నారు. గొల్లప్రోలులో 1,550 ఎకరాలు, పిఠాపురం 400, కొత్తపల్లి 250 ఎకరాల్లో సాగవుతోంది. ముఖ్యంగా నియోజకవర్గంలో చేబ్రోలు, కొత్తపల్లి, గొల్లప్రోలు, గోర్స, వాకతిప్ప, యండపల్లితో పాటు అనేక గ్రామాల్లో రైతులు సేంద్రియ విధానంలో వ్యవసాయం చేస్తున్నారు. తరచూ రసాయన ఎరువులు వాడడం వల్ల భూసారం తగ్గి, పంటలకు చీడపీడలు సోకి దిగుబడి తగ్గుతుండడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైతులు చెబుతున్నారు.

రైతులకు మేలు

సేంద్రియ ఎరువుల వినియోగం వల్ల రైతులకు మేలు జరుగుతుంది. పశువుల పేడ, మూత్రం, పూడిక మట్టిని వేయడం వల్ల భూసారం పెరగడమే కాకుండా, నాణ్యమైన పంట ఉత్పత్తి లభిస్తుంది. భూమిలో తేమ శాతం ఎక్కువ రోజులు ఉండి, పంటలు ఎండిపోకుండా దోహదపడతాయి. సేంద్రియ ఎరువులు వాడిన పంట పొలాల్లో చీడపీడలు, తెగుళ్లు సోకవు. పశువుల పెంటలో నత్రజని, భాస్వరం, జింకు, మెగ్నీషియం, ఐరన్, పొటాష్, బోరాన్ లాంటి సూక్ష్మ పోషకాలు లభించడంతో పైర్లు ఏపుగా పెరిగి, అధిక దిగుబడినిస్తాయి.



గోర్సలో సేంద్రియ వ్యవసాయం చేస్తున్న రైతు

ప్రతి రైతూ దృష్టి సారించాలి



సేంద్రియ వ్యవసాయంపై ప్రతి రైతూ దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. సేంద్రియ ఎరువులతో తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించవచ్చు. అందుకోసమే రైతులకు సేంద్రియ సాగుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. – **జోగిరాజు, ఎంఏవో, కొత్తపల్లి**

ప్రభుత్వమే కొనుగోలు చేయాలి



సేంద్రియ ఎరువుల ద్వారా పండించిన పంటను ప్రభుత్వం, మిల్లర్లు కొనుగోలు చేయాలి. ఇలా చేయడం వల్ల ఎక్కువ శాతం మంది రైతులు ఆసక్తి చూపుతారు. సేంద్రియ ఎరువును గోవు పేడ, మూత్రం, శనగపిండి, బెల్లంతో తయారు చేయవచ్చు. – **సురేష్, రైతు, గోర్స**

తెలుగు బిషప్స్ కౌన్సిల్ అధ్యక్షుడిగా సువార్తరాజు

సామర్లకోట: అంతర్జాతీయ సువార్త వర్తమానికుడు డాక్టరు ఈలి సువార్తరాజు తెలుగు బిషప్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులయ్యారు. మంగళవారం స్థానిక బ్రౌన్‌పేట ట్రూ గాస్పెల్ బాప్టిస్టు చర్చిలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌కు సంబంధించిన తెలుగు బిషప్స్ కౌన్సిల్ నిర్వహించారు. కార్యక్రమానికి నేషనల్ ఇండిపెండెంట్ బిషప్స్ కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ టార్బిస్ కాత్రగడ్డ, టీడీసీ చైర్మన్ బిషప్ సాల్మన్, తెలంగాణ బీజేపీ మైనార్టీ మోర్చా నాయకురాలు అల్క మనోజ్ ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఇప్పటి వరకు రాష్ట్రవ్యాప్తంగా ఏడు ప్రార్థన గోపురాలను ప్రారంభించారని, ఎనిమిదో ప్రార్థన గోపురాన్ని తెలుగు బిషప్స్ కౌన్సిల్ సామర్లకోటలో ప్రారంభించినట్టు ముఖ్యఅతిథులు వివరించారు. దీనికి జీవనది ప్రార్థన మందిరంగా నామకరణం చేస్తున్నట్లు తెలిపారు. అనంతరం తెలుగు బిషప్స్ కౌన్సిల్ మొట్టమొదటి అధ్యక్షుడిగా సువార్తరాజును నియమిస్తున్నట్టు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాలకు చెందిన సభ్యులు ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ విద్యాసాగర్, ఎస్ ఏసురాజు, భాస్కర్‌రెడ్డి, శామ్యూల్, కేటీ బెంజిమన్, యోహాన్ తాడి, జాకబ్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



నియామక పత్రాన్ని సువార్తరాజుకు అందజేస్తున్న ప్రతినిధులు

క్షేమంగా తిరిగొచ్చిన మత్స్యకారులు

కాకినాడ క్రైం: తమిళనాడుకు బోటు కొనడానికి వెళ్లి తిరిగొస్తూ శ్రీలంక జలాల్లోకి ప్రవేశించిన నలుగురు మత్స్యకారులు క్షేమంగా తిరిగి కాకినాడకు చేరారు. 53 రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత వారు తమ కుటుంబాలను కలుసుకున్నారు. వివరాల్లోకి వెళితే, ఈ ఏడాది జూలై 19న కాకినాడకు చెందిన పంతాడి బ్రహ్మానందం తమ ప్రాంతానికి చెందిన కర్రి నూకరాజు, చింతా నాగేశ్వరరావు, కొప్పాడి శ్రీనుతో కలిసి తమిళనాడులోని రామేశ్వరం సమీపంలో ఉన్న తుతూర్‌కు బోటు కొనడానికి వెళ్లారు. సుమారు రెండు వారాల తర్వాత ఆగస్టు రెండున ఉదయం 8 గంటల సమయంలో కాకినాడకు బయల్దేరారు. మూడో తేదీ సాయంత్రం తమ వెంట కోస్టుగార్డు బోటు రావడాన్ని గమనించారు. బోటు ఆపడంతో కోస్ట్‌గార్డ్ సిబ్బంది వారిని తనిఖీ చేయడం మొదలెట్టారు. ఎందుకు తనిఖీ చేస్తున్నారని ప్రశ్నిస్తే.. శ్రీలంక జలాల్లోకి అక్రమంగా ప్రవేశించి, మూడు కిలోమీటర్లు దూసుకొచ్చారని వారు సమాధానమిచ్చారు. చేసేది లేక తమ బోటును వారికి అప్పగించి, ఆరు గంటల సుదీర్ఘ ప్రయాణం తర్వాత మరో కోస్టుగార్డు సాయుధ బృందానికి వీరిని అప్పగించారు. వీరిని కోర్టులో ప్రవేశపెట్టి జైలు నిర్బంధానికి పంపారు. ఈ విషయం తెలుసుకున్న కాకినాడ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డి హుటాహుటిన శ్రీలంక జైలుకు న్యాయవాదితో పాటు నలుగురు వ్యక్తుల్ని పంపించారు. శ్రీలంకలోని భారత రాయబారి అధికారి వారికి తోడ్పాటునందించారు. మత్స్యకారుల కుటుంబ సభ్యులు కూడా ప్రజాప్రతినిధులు సాయం తీసుకున్నారు. ఎట్టకేలకు 53 రోజుల సుదీర్ఘ నిరీక్షణ తర్వాత కోర్టు ఆదేశాల మేరకు, మత్స్యకారులు మంగళవారం కాకినాడకు చేరుకున్నారు. కోస్టుగార్డు స్టేషన్ వద్ద మత్స్యకారులకు వారి కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా అధికార ప్రతినిధి సుంకర విద్యాసాగర్, యువజన విభాగం అధ్యక్షుడు రాగిరెడ్డి అనిల్‌కుమార్(బన్నీ) స్వాగతం పలికారు. వారితో పాటు కాకినాడ ఎంపీ ఉదయ శ్రీనివాస్, ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ ఉన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మానందం మాట్లాడుతూ, శ్రీలంక కోస్టుగార్డు, నేవీ అధికారులు తమతో దారుణంగా వ్యవహరించారని ఆరోపించారు. తమ బాధ చెప్పుకొనేందుకు భాష అవరోధంగా మారిందని విలపించారు. ద్వారంపూడి చంద్రశేఖర్‌రెడ్డితో సహా, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు ధన్యవాదాలు తెలిపారు. వీరితో పాటు ఇండియన్ కోస్టుగార్డు, మత్స్య శాఖ అధికారులు తమకు సహకరించారన్నారు.

ఎమ్మెల్సీకి అవమానం

మత్స్యకార మహిళ అయిన ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీకి అవమానం జరిగింది. ఆహ్వానం పలికేందుకు మత్స్యకారుల వద్దకు వెళుతున్న ఎమ్మెల్సీని మహిళ అని కూడా చూడకుండా ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెనక్కి నెట్టేశారు. దీనిపై తీవ్ర అసహనానికి గురైన మత్స్యకారులు ఎంపీ తీరును ఖండించారు. ఈ క్రమంలో కొంత అలజడి చెలరేగింది. ఈ ఘటన దురదృష్టకరమని ఎమ్మెల్సీ వ్యాఖ్యానించారు.